# మిత్రుని స్మృతి

= శ్రీ 'సహజానంద' =

"పౌర్ణమి!

యౌవనమునకు మదిగ!

వయసు తెఱలు తొలగించి, తుపానుల రేగ గొట్టును.

ఆరాత్రి సముద్రమం దెంత కోలాహలము!

అలఅలలో ఎంత రొద!

ప్రాణమం దెంతటి మధురఘోష!

ఏమి యీ జ్వాలానృత్యము !

యౌవనము చిగిర్చిన చోట ఎన్ని కోకిలలు విసుగులేక గొంతుక కోసుకొనునది!

ఎంత ప్రచండశక్తి—ఈయౌవనము!

దీని విజృంభణముందు జనులు పాదధూళి!

దీని తృష్ణముందు సింహాసనములు పిల్లికూనలు!

దీని పరవశములో అద్వితీయమైన దేదీప్య సౌందర్యము పంజరములో చిలక!

ఆకాశమందు చూడుము—మబ్బులు మాత్సర్యము క్రమ్మి నలుపెక్కును. దీపము లారి, చీకటి వ్యాపించును. తుళ్లిపడి, తుపానులు లేచి, సృష్టి యొక్క కూకటివేళ్ల పెకలింపవైవ చూచును. మృత్యువు చీకటిగుహలందు గర్జించు గర్జనలకు రోదసి అదరి నేలపై పడునా అని తోచును.

తరువాత......శాంతి!

కాని...

ఎంత వినాశనము?

ఎంత ప్రాణనష్టము!

ఎన్ని ఓడలు సముద్రపుఒడిలో ఒదిగిపోయినవి! ఎన్ని భవంతులు కూలి, ఎంత మందికి గోరీలైనవి!

అనాధప్రకృతియం దెంతటి పౌరుషము ప్రచ్ఛన్నమై యున్నదో!

రాతిని గీటుము!......శతాబ్దముల రక్తతృష్ణతో అగ్నిజిహ్వను చాపును—

వీటితో పోల్చుము—యౌవనమును!

ఎంత పిపాస!

ఎంత ఉద్వేగము!

కన్నులం దెంతటి కామన!

వెలుతురు చొఱరాని కీకారణ్యము-యౌవనము.

అహో!

మన్మథుని నృత్యశాల!

వసంతుని ఉద్యానవనము!

ఈదవానలాన్ని చవిచూడని ప్రాణి ఎవరు?

కాని యౌవనమునకు అనాది, అజేయశత్రువు మృత్యువు!

ఈరెండిటి ఘోరసంగ్రామమే మానవచరిత్ర!

మృత్యువుకు ముదుసలు లన్న మురిపి!"

మిత్రుడు తన ఆవేశాన్ని ఆపాడు. తీవ్రమై, తీక్షణమైన వ్యాధి దాపరించినపుడు జీవుని అంతరాత్మ మేలుకొని, తన ఆకృతిని విమర్శించుకొనును. దేహము యొక్క శక్తి సన్నగిలునపుడు, మత్తు వదలి మనసు విచారణమగ్నమవును. ఈజీవి ఏమి? దీని గతి ఏమి?— ఈ కఠోరప్రశ్నల కాళచ్ఛాయలు రోగికన్నుల నావరించును. మిత్రుని ముఖంలో ఈ క్రొత్త ఆందోళన

నన్ను చాల కంగారుపఱచినది. ఆతురతతో చెప్పాను: "ఈ ఆలోచన మంచిది కాదు." అని.

"ఆలోచన! మంచిమాట చెప్పావు? ఈ ఆలోచనవెనుక ఎట్టి ప్రచండదవానల మున్నదో నీకు తెలియదు. మృత్యువు నీ..."

వినలేక, గట్టిగా అన్నాను:

"నీకు మతిపోతోంది. ఈ వెఱ్ఱి ఊహలతో. మనస్సు మార్చుకో".

"అవును. మృత్యువు నీ గడపవద్ద గంటమోగించినప్పుడైనా నీ ఆంతర్యము నీవు తెలుసుకోవద్దూ? అదిగో...అప్పుడే నాపై మృత్యువునీడలు కమ్ముతున్నయ్...ఓ...(భార్య నుద్దేశించి) దుఃఖించి, ప్రయోజనం లేదు. శతాబ్దాలుగా సృష్టి అనుభవిస్తున్న ఈ శాపభరం ఇవ్వాళ నువ్వూ, నేనూ తప్పించుకోలేం."

అతని భార్య అతనికంటె ఎక్కువ బాధపడుతోంది. ఆమెహృదయంలో ఎంత చిచ్చు రగులుతోందో నే చెప్పలేను.

చంటిపిల్ల ఉయ్యాలలో నిద్రపోతోంది.

మఱల మిత్రుడారంభించెను;

"నీకు తెలియును నాప్రకృతి. రెండురోజుల కితం కృష్ణానదిఒడ్డుకు వెళ్లాను. సూర్యుడింకా చీకట్లో మునిగిపోలేదు. మారాన శివాలయంలో ఎవడో శంఖం పూరించాడు. ఎవ్వరో నలుగురు వచ్చి చితిని పేరుస్తున్నారు. కాసేపటికి ఒక పాడె... జనం...

ఇందులో విశేషము లేదు. కాని?

ఆ చితి!

చీకటిపడుచున్నది.

కాని శవమును వీడ రా ఆడవాండ్రు!

ఏమిది?

ఇది విచిత్రముకాదా?

ఘోరమైన రుద్రభూమిలో ఈ దృశ్య మెవ్వరైన చూచిరా?

విగతమైన జీవము. బొమికెల పటము. ఆ చెల్లెళ్లు, ఆ తల్లి, ఆ తండ్రి...సజీవమైన తమ బిడ్డను నదిలోనికి విసరుచున్నట్టు; ఏమి ఆ రోదనము!

మృత్యువం దెంతటి సంక్షోభ!

శూన్యమం దెంత భ్రాంతి!

ఆకృతియం దెంత మక్కువ!

పురాణములందుకూడ ఈశ్మశానదృశ్యము కానరాదు.

నా కాళ్లు వణకినవి!

చితి నిప్పంటుకొన్నది!

నెత్తురు చిమ్మినట్లు!

దగ్గఱకు పోయి తెలిసికొంటిని. ఈ వూరువారు కారనియు, కార్యార్థమై వచ్చిన తమ కొడుకు హఠాత్తుగా గుండె ఆగి, ఇక్కడ మరణించెననియు."

మిత్రుడు నాకేసి చూశాడు. అతని చూపుయొక్క తీక్షణతముందు నేను మూగనైతిని.

"అవును. ఇందులో విశేష మేమున్నది? ఈ సంఘటనలో ఏమి విచిత్రమున్నది?

అదే! మృత్యువుయొక్క నీడలోగాని మనిషి నిజాన్ని తెలుసుకోలేడు.

చూడు! ఆ తల్లి తండ్రులకు ఒకే ఒక కొడుకు అతడు. పాతికేళ్లు వచ్చి, పరీక్షలు ప్యాసయి, చేతికి అక్కఱకువస్తాడుగదా అని అనుకొనే సమయంలో, మృత్యువాతపడ్డాడు. నలుగురు చెల్లెళ్లు! 'శిలలు ద్రవించేట్టు ఏడ్చారు! ఏమైనది అతని కథ! ఎవడనుకున్నాడు ఇలా జరుగుతుందని! ఆ తల్లిగుండె దేహంలో గుప్పెడు బూడిదై, గిలగిల తన్నుకుంటోంది! తండ్రి! కట్టుకట్టిన గాయం! ఆ ఇల్లు!

ఇక ఆలోచించు మనుష్యుని ఐశ్వర్యము, అభివృద్ధి! మృత్యువును ముఖాముఖీగా కలుసుకోటానికి ధైర్యం లేకపోతే, చాటునైనా దాని కాటు తినక

తప్పదు. మన ఈ వ్యర్థకాలయాపన, కాలక్షేపం— మనవెనుక మృత్యువును పెట్టుకునే!

కాని అతడు పెళ్లి చేసుకోలేదట...అందఱకు ఆ అదృష్టం ఉంటుందా?"

మిత్రుడు సొమ్మసిలి కళ్లు మూశాడు. వంటిపై చెయ్యివేశాను. చల్లగా ఉంది. దీపపు వెలుతురులో ఆమెకుంకుమ నెత్తురుదివ్వెవలె కనబడుతోంది. నాకు శక్తి నశించింది. ఈఘటనలో ప్రళయగంట మోగి నట్లున్నది. చూస్తూవుండగా చెఱువుమెట్లపై నుండి జారి పిల్లవాడు నీళ్లలో మునిగి పోవుచున్నట్లు!

నాకేమీ తోచలేదు. వైద్యులకు ప్రాణమన్న- అవయవముల ఆటుపోటని!

మిత్రుని ముఖం భయంకరంగా ఉంది.

ఇంటిలో పెద్దవాళ్లులేరు.

మర్నాడు...

జ్వరం...తగ్గలేదు. వైద్యుడింటిలో కంగారు మాటలు చెప్పిపోయెను. నే వెళ్లేప్పటికి చంటిపిల్ల కాళ్లువిరిగిన గుర్రంతో ఆడుకుంటోంది! ఆ చంటి ముఖాన పట్టరాని సంతోషము! మిత్రుని ముఖంలో అగ్నిహోమం!

"నే చెప్పలేదూ! మృత్యువు గంట మోగించిం దని. నీ, నా మైత్రి కిక ముగింపిది. ఈ నాలుగేళ్ల మన స్నేహంలో పూర్ణసంతోషాన్ని అనుభవించాను. నువ్వెవడవు? నేనెవడిని? నీ కీసంబంధ మేమిటి? ఇది మన మనోజీవితము. నీ కాశ్చర్యం వేయవచ్చు— నావైఖరి చూసి! కాని నాకు పిఱికలేదు. మృత్యువుకు నే ఏడ్పులతో, పెడబొబ్బలతో స్వాగతం చేయ దలచుకోలేదు...కాని..."

మిత్రుని కళ్లలో నీళ్లూరినయ్.

ఇది దారుణపరీక్ష!

"ఈ ఇల్లు....నేను....నాభార్య...పిల్ల.... నువ్వున్నావు—ఇలాంటి సౌఖ్యము ఎంతమంది కున్న దని. కాని ఈనాడు..."

మిత్రుని స్వరం గాద్గదికమైంది.

కాని ఈనాడు?

ఇది దారుణ ప్రశ్న!

ఈప్రశ్న బాణం నామనస్సును గాయపఱచింది.

"ఈ జీవితమున కర్థమేమి? ఈ తల్లి బిడ్డల గతి యేమి? ఇది అని, అది అని చెప్ప మూర్ఖులు పెక్కు మంది. ఈ దాంపత్య మేమి? కొలదికాలపు సాంగత్య వినాశనంలో ఇంత దారుణబాధ ఏమి? నాకు తెలుసు...నాభార్య వేదన మరణవేదనకన్న హెచ్చు! నీవంటివి—"నీ జీవితము ధన్యమైన"దని. కాని ప్రాణుల మధ్య ఈ బంధనముల రహస్య మేమి? ఎడబాటులో ఇట్టి కఠోరసంక్షోభ ఏల?...నా ఈ అభాగ్య జీవితంతో ఎంత దారుణ విషాదగాథ వ్రాసిపోతున్నాను- నావెనుక!"

నేను మాటలాడు స్థయిర్యము తప్పినది. మృత్యుప్రేరితమైన మిత్రుని ఈ జంఝూమారుతము ముందు నేను గడ్డిపోచను.

నాలుగవరోజు సూర్యునితోపాటు మిత్రుడు అస్తమించాడు! ఆ వినిర్మలముఖంలో జీవితపు తుది తేజస్సు ఉద్దీప్తమై ఉంది. సుపరిచితమైన ఆ ముఖంలో కాలం ఒక్కసారి గిర్రునతిరిగినట్టుతోచింది.

కాలం!

మనుష్యుని కన్నీటి కావేరి!

శరచ్చంద్రఛటోపాధ్యాయ ఇలా వ్రాశారు: "పోతూ పోతూ పాంథుడు వండుకొన్న కుండలను పగలకొట్టిపోతాడు" అని. ఇది అందఱు పాంథుల విషయంలోనూ వర్తిస్తుంది!

అహరహస్సు; అనుక్షణం; ప్రతిచోట; ప్రతి కార్యకలాపంలో అదృశ్యంగా దృశ్యమయ్యే నా మిత్రుడు 'సోక్రటీస్'ని జ్ఞప్తికి తెస్తాడు!

ఉత్తేజితమైన ఓ జిజ్ఞాసువా! నీ ఆత్మకు అమర శాంతి.

నీ వలన స్వర్గమున కెంత శోభ!!